


# ధృవతార

**బి. స్వర్ణాంబ**

**'పెళ్ళినాడు అరుంధతీ నక్షత్రం చూపించారు. ఆమె భర్త ననుసరించి మెలిగే స్త్రీ ఆదర్శమూర్తి. ఆమెతో పోల్చుకోవడం కాదు కానీ, నాకు నా భర్తే సర్వస్వం. ఆయనెంతో మంచివారు. భగవంతుడు. ఇంత గొప్ప వ్యక్తిని నాకు భర్తగా ప్రసాదించినందుకు ఎంతో కృతజ్ఞత తెలుపుకోవాలి....''**

రమ వ్రాసిన ఉత్తరం చదువుతూంటే నా ఆలోచనలన్నీ రమ చుట్టూ మూగుతున్నాయి. ఉత్తరం ఆపి ఆలోచిస్తున్నాను.

రమ నా క్లాస్‌మేట్. బి. ఏ. తో దాని చదువు ఆగిపోయింది. పెళ్ళయ్యాక గృహిణిగా స్థిరపడిపోయింది. వీలున్నప్పుడల్లా వాళ్ళ ఊరు వెళ్ళేదాన్ని. రమ భర్త శేఖరం చాలా మంచివాడు. వాళ్ళ అన్యోన్య దాంపత్యం చూస్తే ముచ్చటేసేది. కాని ఒకే అపశృతి. నలభై ఏళ్ళొచ్చినా రమకు పిల్లలు పుట్టలేదు.

"మీ స్నేహితురాలికి పెద్ద బెంగండీ పిల్లలు లేరని. నేనే పిల్లాణ్ణి అనుకోరాదా–" అనేవాడు శేఖరం.

"ఛీ– ఏమిటా మాటలు" అని రమ విసుక్కునేది.

ఒకమారెప్పుడో శేఖరం ఊరికి వెళ్తే రమ ఆ రెండు రోజులూ తెగ బెంగ పెట్టుకుందట! అన్నం మానేసిందట! ఆయనకు ఆ ఊళ్ళో మంచి భోజనం దొరికిందో లేదోనని రమ బాధ.

అతను మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లో రమ ఎక్కడికైనా వెడితే మరుసటి దినమే వెళ్ళి తీసుకొచ్చేవాడు.

పాలు, నీరులా కలిసి పోయారు వాళ్ళిద్దరూ.

వరకట్నపు చావులు గూర్చి విన్నప్పుడల్లా రమ కలవరపడిపోయేది. "మా నాన్న ఈయనకు కట్నకానుక లేవీ ఇవ్వలేదు. అయినా ఎప్పుడూ ఆయన దాన్ని గూర్చి ప్రస్తావించలేదు" అనేది.

అటువంటి రమకు ఈనాడు ఎటువంటి స్థితి? శేఖరం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పచ్చకామెర్లు వచ్చి చాలా డీలాపడి పోయాడు. అది బాగయిం తర్వాత విపరీతమైన తలనొప్పి... ఎక్స్‌రేలు. మందులు... ఎన్నివిధాలుగానో చికిత్స జరుగుతోంది. మనిషి చాలా నీరసించి పోతున్నాడు. ఏది సరిగ్గా నిర్ధారణ చేయలేకపోతున్నారు డాక్టర్లు.

ఇవన్నీ తెలిసి నేను రమను చూడ్డానికి వెళ్ళాను. రమ నన్ను పట్టుకుని బావురుమంది.

**"ఈయనకేమైనా అయితే నేను బ్రతకనే"– అంది.**

"ఛ– ఏం మాటలవి? పూర్తో– శేఖరానికి ఏమీ కాదు" అని ఓదార్చాను. కానీ శేఖరం పరిస్థితి చూస్తే నాకు ఆందోళనగానే ఉంది.

మెల్లిగా డాక్టర్ల నడిగి విషయం తెలుసుకున్నాను. అతనికి ఆపరేషన్ అవసరం కావచ్చునన్నారు డాక్టర్లు.

శేఖరానికేమైనా అయితే?... రమ బ్రతకదు... నాకు ఆ ఊహే భయంకరంగా అన్పించింది.

ఆ తర్వాత రమతో రెండు మూడు రోజులు గడిపి మా ఊరికి వచ్చేశాను తనకు ధైర్యం చెప్పి.

ఇంటికి వచ్చాక నాన్నగారికి సీరియస్‌గా ఉందని టెలిగ్రాం వచ్చింది. మద్రాసు వెళ్ళిపోయాను. ఆయన్ని ఆస్పత్రిలో చేర్పించారు. రెండు నెలలు ఆయనతో పాటు ఆస్పత్రిలో గడపాల్సి వచ్చింది. ఈ మానసిక ఆందోళనతో పాటు రమ భర్త కెలా ఉందోనన్న ఆలోచన.

నాన్నగారికి కొద్దిగా నిమ్మళించింది. ఇంటికి వచ్చాక తలుపు తీయగానే పోస్ట్‌మాన్ పడవేసిన ఉత్తరాలు కనిపించాయి. అందులో రమ వ్రాసిన ఉత్తరం ఉంది. ఆత్రంగా చింపాను. నిర్ఘాంతపోయాను. మళ్ళీ మళ్ళీ చదివాను. విషయం అర్థం కావడానికి ఎంతో సేపు పట్టలేదు.

"స్వర్ణా,

శేఖరం ఆరోగ్యం కుదుటపడలేదు. డాక్టర్లు చెప్పిందాన్ని బట్టి ఆయన ఇక బ్రతకడని తేలిపోయింది. (ఈ వాక్యం ఎలా రాస్తున్నానో నాకే తెలియదు). ఆయన లేకపోతే నేనూ లేను. దిగులుతో, ఉపవాసాలతో శుష్కించిన ఈ ( ' నుండి ప్రాణం పోవడం ఎంతసేపు. అందుకే ఆత్మహత్య చేసుకోవాలని నిశ్చయించుకున్నాను. ఉత్తరం నీకు చేరేసరికి నేను నీకు దొరకని దు తీరాలకు వెళ్ళిపోతాను. నీ స్నేహితం వచ్చే జన్మ( కూడా లభించాలని కోరే నీ రమ."

నా కళ్ళమ్మట నీళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి. తేదీ చూశాను. ఆ ఉత్తరం రాసి నెల దాటిపోయింది. నా గుండె గబగబా కొట్టుకుంది. రమ తన ఆందోళనలో ఉత్తరం ఇక్కడకు రాసింది. నేను మద్రాసులో ఉన్నట్టు తనకు తెలుసు. అంటే... రమ ఇప్పుడీ లోకంలో లేదు. ఈ విషయం అర్థమయ్యేసరికి నాకు దుఃఖం ఆగలేదు. టేబిల్‌పై తల ఆనించి వెక్కి వెక్కి

## షబ్నా కోరిక



ఒక పెద్ద చిత్ర నిర్మాత షబ్నాఆజ్మీని తన చిత్రంలో నటించమని అడిగాడట. అందుకు ఆమె ఒక షరతు విధించింది. తిండి మాత్రం తను చెప్పిన రెస్టారెంట్ నుంచే తెప్పించాలనట ఆ షరతు. మరి ఆ రెస్టారెంట్‌లో తిండి [illegible] కున్నాడో ఏమో. ఆ నిర్మాత షరతుకు గుడ్‌బై కొట్టేశాడట. కోరికలకు కూడా అంతుండాలి మరి!


ఏడ్చాను. కాస్సేపయాక తేరుకొని వెంటనే రమావాళ్ల ఊరికి ప్రయాణమయ్యాను.

బస్సులో కూర్చున్నాన కానీ రమ [illegible] ఇల్లు ఎలా చూడాలని బాధపడ్డాను. అసలు ఆ ఇంట్లో ఎవరుంటారని నేను వెదుతున్నాను. ఎవరైనా బంధువులు వచ్చి ఆక్రమించుకున్నారేమో? ఇలా ఆలోచనలతో నా తల పగిలిపోయింది.

అలా యుగం ప్రయాణించాక రమావాళ్ల ఊరు వచ్చింది. గుండెలు గుబగుబలాడుతుండగా బస్సు దిగి, రిక్షా ఎక్కి బయలుదేరాను. రమా వాళ్ళున్న ఇల్లు వీధి దగ్గరికి వచ్చేసరికి నా కాళ్ళు నీరసించినట్లయ్యాయి. తల దిమ్మెక్కింది. ఆలోచన శూన్యమయిపోయింది.

'ఎక్కడాపమంటారమ్మా'- అని రిక్షా అతను అడిగితే కానీ నాకు తెలివిరాలేదు. రమ ఇల్లు దాటిపోయింది. రిక్షా ఆపించి దిగాను. కాళ్ళు తేలిపోతున్నాయి. అడుగు పడలేదు. ఎలాగో నిలదొక్కుకుని మెల్లిగా రమా వాళ్లింటి వేపు నడిచాను. ఆ శూన్య గృహాన్ని ఎలా చూడటం? అసలు ఎవరుంటారా ఇంట్లో? నేనెందుకొచ్చా నిక్కడికి? ఎవర్ని చూడాలని?సమాధానం లేని ప్రశ్నలతో నా తల వేగిపోతోంది.

ఆ ఇల్లు పాతకాలంది. ముందు ఎత్తుగా ప్రహరిగోడ. కాస్త దూరం నడిచి లోపలికి వెళ్లగానే వరండా తర్వాత హాలు వగైరా.... ప్రహరిగోడ దాటి లోపలికి వెళ్లాను. వరండాను అనుకొని పెద్ద షామియానా, మామిడాకు తోరణాలు. కాస్త ఎండిపోయినవి.... రంగు రంగుల కాగితాలు....



Saraswata Niketan
Acc. No

నాకేం అర్థం కాలేదు. పొరపాటున వేరే ఇంటికి వచ్చానా అనుకున్నాను ఒక క్షణం. కానీ కాదని వెంటనే నిర్ధారించుకున్నాను. అప్పుడే ఎవరో వేరేవాళ్ళు ఇంట్లో దిగినట్టున్నారు. ఎవరై యుంటారు?... ఆలోచిస్తూ హాల్లోకి నడిచాను. అక్కడ ఉయ్యాల బల్ల. నేను, రమ, కూర్చుని హాయిగా కబుర్లు చెప్పుకునేవాళ్ళం. నా కళ్ళు నీళ్ళతో నిండాయి. రమా లేదు అనే భావన నన్ను క్రుంగదీసింది. కళ్ళు తుడుచుకుంటూ అలా నిలబడిపోయాను.

ఇంతలో ఎవరో ఒకావిడ 'ఎవరూ?' అంటూ అటుగా వచ్చి నన్ను చూసి 'ఎవరమ్మా నీవు?' అంది. ఆమెను ఇంతకు ముందు చూసిన గుర్తులేదు. "ఇక్కడ రమ, శేఖరం అని ఉండేవాళ్ళు. ఇంతకు ముందు...." అని నేను చెప్పబోతున్నాను. లోపల నుండి వచ్చిన వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాను.

వెర్రిదానిలా చూస్తూ నిలుచుండి పోయాను. ఆ వచ్చిన వ్యక్తి శేఖరం.

ఈ లోకంలో నే లేడని నేననుకుంటున్న శేఖరం...

జబ్బు మనిషిలా కూడ లేడు. సరికదా, పైపెచ్చు ఆరోగ్యంగా కనిపిస్తున్నాడు.

నాకళ్ళని నేనే నమ్మలేకపోయాను.

కలా? నిజమా? అర్థం కాలేదు. అయిత ఈయనకు జబ్బు నిమ్మళించిందన్న మాట?.... అయితే రమ ఏ అఘా యిత్యమూ చేసి ఉండదు.

వెంటనే, నా నోట వెలువడిన ప్రశ్న అదే....

'రమ ఎక్కడుంది? మీరు కులాసాగా వున్నారా?" అని.

అతను విషాదంగా నవ్వాడు.

'రండి, కూర్చోండి!-" అన్నాడు.

మంచినీళ్ళు, కాఫీ తెప్పించాడు.

నాకు అవేవీ అక్కర్లేదన్నాను.

వెంటనే సమాధానం చెప్పడేం? నాలో అసహనం పెరిగిపోయింది.

"శేఖరంగారూ! రమ ఎక్కడ?" అని అడిగాను అరిచినట్లుగా.

అతను తల వొంచుకున్నాడు.

"తను పోయి నెల దాటిందండీ- మీకు ఉత్తరం రాశాను కూడ." అన్నాడు.

అప్పుడు అతని వైపు పరీక్షగా చూశాను. అతని వేషంలో ఏదో విలక్షణత్వం.... అవును..... అది పెళ్ళికొడుకు వేషం. కాళ్ళకు పారాణి, చేతికి కొత్త రిస్ట్ వాచీ-మెరుస్తున్న ఉంగరాలు. మెళ్ళో పులిగోరు హారం.... చెప్పండి. ఏం జరిగింది?- నా అరుపు విని అతను చకితుడయ్యాడు.

తప్పు చేసిన వాడిలా తలదించుకున్నాడు.

"రమ నా పరిస్థితి చూసి భయపడిపోయింది. నేను చచ్చిపోవడం ఖాయమనుకుంది. వెంటనే ఆత్మహత్య చేసుకుంది. రమ మరణం నన్ను కుంగదీసింది. అయినా చిత్రంగా నేను కోలుకున్నాను. డాక్టర్లే ఆశ్చర్యపోయారు-"

ఇంతలో ఆవిడ అందుకుంది.

"ఆ పిల్ల పోయాక ఇతన్ని మామూలు మనిషిని చేయడానికి శతవిధాల ప్రయత్నించామమ్మా. పోయిన వాళ్ళతో మనమూ పోలేము కదా? పోరి పోరి, చివరికి పెళ్ళికి ఒప్పించాను...." ఇలా మాట్లాడుతూ ఆమె, 'ఒసే, భానూ, ఇలా రా!" అని లోపలికి కేకేసింది. ఆ భాను లోపల్నుండి వచ్చింది. మెడలో పసుపుతాడు, పాదాలకు పసుపు, నవవధువు లక్షణాలు కనిపిస్తున్నాయి. నాకు తేళ్ళూ, జెర్రులూ పాకినట్టయింది.

ఇదా శేఖరం అసలు స్వరూపం? రమ ఇతని కోసమా! త్యాగం చేసింది. జీవితాన్ని ప్రేమకు పణంగాపెట్టింది. కానీ ఫలితం?

నాకు శేఖరాన్ని చూడాలంటేనే అసహ్యం కలిగింది. ఇంకో క్షణం అక్కడుండ బుద్ధికాలేదు. గబుక్కున, వీధి వాకిలి వైపు నడిచాను. శేఖరం, "అదేమిటి? వెళ్ళిపోతున్నారేం?" అంటూ ఆశ్చర్యపోతూ నా వెంటనేవచ్చాడు.

ఆవిడా అర్థం చేసుకుంది- "చూడు తల్లీ, రమ తన భర్తకేమో అయిపోతుందని ప్రాణాలు తీసుకుంది. కానీ ఇతను బ్రతికాడు. నా కూతురు భానుకు నలభై ఏళ్ళు వచ్చాయి. ఎంత వెదికినా పెళ్ళి సంబంధం కుదరలేదు. బీదదాన్ని. వేలకు వేలు కట్నం పోయలేను. ఇటువంటి పరిస్థితిలో ఈయన దేవుడిలా తారసపడ్డాడు. ఇతనికి నలభై ఐదేళ్ళ వయసుంది. ఇంకా ఎంతో జీవితం ముందుంది. ఒంటరిగా ఎలా గడుపుతాడు? అందుకే బతిమాలి మా పిల్లను చేసుకొమ్మన్నాను. దేవుడు కరుణించాడు. ఇతను ఒప్పు కున్నాడు...." నేను ఆమె మాటలు పూర్తిగా వినలేదు. రోడ్డు మీదికి వచ్చేశాను. కనబడిన రిక్షా ఎక్కాను.

"స్వర్ణమ్మగారూ! వెళ్ళిపోకండి-" శేఖరం అరుస్తున్నాడు. నేను వినిపించుకోలేదు.

ఎంత విచిత్రం? శేఖరం కోసం ప్రాణాలు తీసుకుంది రమ. అతను టింగు రంగా అని పెళ్ళికొడుకయ్యాడు. వృద్ధ కన్యలు పెరిగిపోతున్న ఈ దేశంలో మధ్యతరగతి వారికి నలభై అయిదేళ్ళ, ఉద్యోగస్థుడైన పెళ్ళికొడుకు దొరికాడంటే వదలుతారా?

అందుకే శేఖరం మళ్ళీ పెళ్ళి కొడుకయ్యాడు. అతను మాత్రం ఋషి కాడుకదా?

కానీ నన్నొక్క సందేహం ఇప్పటికీ పీడిస్తోంది. ఒక వేళ శేఖరం చనిపోయి, రమ మళ్ళీ పెళ్ళి చేసుకొని వుంటే ఈ సమాజం హర్షించేదా? అసలు ఆమెను చేసుకోవడానికి ఏ మగాడైనా ముందుకు వచ్చేవాడా?

ఇంకా అంత ఎత్తుకు ఎదగలేదు సమాజం. పైగా భార్య పోయిన మూడు నెలల లోపల మగాడు పెళ్ళాడాలని రూలు కూడా వుంది.

"రమా! అపాత్రదానం చేశావు నీ ప్రేమ-" అని మనసు మూలిగింది.

## గోవింద జాగింగ్

నటులు గొప్పవారే కావచ్చు కాని వారి దగ్గర పనిచేసే బంట్రోతులను బానిసలుగా చూసేవారు అరుదట. అట్లాంటి వారిలో గోవిందను లెక్కలోవేసుకోవచ్చు. రోజూ తాను మైలుదూరం జాగింగ్ చేస్తాడట. జాగింగ్ వరకు



బాగానేవుంది. అతని వెనకే తన సర్వెంటు ప్యాంటు షర్టు కూడాపట్టుకొనే ఈ మైలుదూరం జాగింగ్ చేయాలట. ఇదెక్కడిచోద్యం! మరీ అంత బానిసగా చూస్తుంటే ఆ సర్వెంటు ఎంతకాలం వుంటాడు?!